సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 30 । జూన్ । 2023



రింగ్‌రైల్‌తో మహర్దశ

ట్రిపుల్‌ఆర్ చుట్టూ రైల్వేలైన్ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రయోజనం చేకూరనుంది. 8లో



చిరకాల స్వప్నం నెరవేరింది

గౌరవెల్లి ప్రాజెక్టుతో హుస్నాబాద్ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. గురువారం రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. 8లో

నేడు డయల్ యువర్ డీఎం



సంగారెడ్డి టౌన్: రోడ్డు రవాణా సంస్థ సంగారెడ్డి డిపో ఆవరణలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ప్రయాణికులు 85003 76267 సెల్ నంబర్‌కు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు తెలపాలన్నారు.

న్యూస్‌రీల్

గ్రూప్-4 పరీక్షలకు ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్: జులై 1వ తేదీన నిర్వహిస్తున్న గ్రూప్–4 పరీక్షలకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ యస్.సుదర్శన్ గురువారం తెలిపారు. 134 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచామని, బస్టాండ్లలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామని అభ్యర్థులు వినియోగించుకోవాలన్నారు.

వైభవంగా రథయాత్ర



రథోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధి వైఎస్సార్ కాలనీలోని పూరీ జగన్నాథ స్వామి దేవాలయంలో గురువారం విశేష పూజలు జరిగాయి. స్వామివారి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొల్లారంలో పూరీ జగన్నాథ స్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ నిర్వాహకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కేతకిలో భక్తుల సందడి



కంట్లం పూజ చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): తొలి ఏకాదశిని పురస్కరించుకుని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయాన్ని భక్తులు సందర్శించారు. గురువారం ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందుగా భక్తులు ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం, అర్చన, మహామంగళహారతి ఇచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–24 సంవత్సరానికి తాత్కాలికంగా ఉపాధ్యాయ లేదా అధ్యాపకులుగా పనిచేయుటకు ఇంగ్లీష్ మీడియంలో బోధించగల అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడబ్ల్యూఆర్ఈ సంగారెడ్డి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ పీఎస్ కల్యాణి గురువారం తెలిపారు. దరఖాస్తు ఫారాలను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పొందవచ్చన్నారు. పూరించిన దరఖాస్తుతో అభ్యర్థి విద్యార్హతల జిరాక్స్ జతచేసి జులై 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అదే పాఠశాలలో సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులు జులై 7వ తేదీ ఉదయం 9 గంటలకు రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్, మానస హిల్స్, టీటీడబ్ల్యూఆర్ ఐఐటీ స్టడీ సెంటర్‌లో గల రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో డెమో, ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు. బాలికల విద్యాలయాల్లో మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. జూనియర్ లెక్చరర్ పోస్టులు 10, పీజీటీలు 13, టీజీటీలు 10, పీడీలు 2, పీఈటీ 1, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 1 మొత్తం 37 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 83339 25393 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

నేడు యువ ఉత్సవ్

సంగారెడ్డి టౌన్: ఈనెల 30వ తేదీన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి గురువారం తెలిపారు. యువత ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు యువ ఉత్సవ్–2023 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సృజనాత్మక రచన, కవిత్వం చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, జానపద కళలు తదితర అంశాలపై యువ ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం, సర్టిఫికెట్స్ అందజేస్తారని తెలిపారు. ప్రతిభ చూపిన యువత రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి వెళ్లే అవకాశం ఉందన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసుగల యువకులు, ఔత్సాహికులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9963056730లో సంప్రదించవచ్చన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి

తొలి ఏకాదశిని పురస్కరించుకొని సంగారెడ్డిలోని దేవాలయాలను భక్తులు సందర్శించారు. గురువారం పట్టణ శివారులోని వైకుంఠపురంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, లక్ష తులసి అర్చన చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– సంగారెడ్డి టౌన్



వైకుంఠపురంలో కొలువైన స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఘనంగా బక్రీద్

బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం జిల్లాలోని అన్ని ఈద్గాలు, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంగారెడ్డిలోని ఈద్గాలో ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు నిర్వహించి దైవ సందేశం వినిపించారు.

– సంగారెడ్డి మున్సిపాలిటీ

దశాబ్ది ఉత్సవాలకు రూ.5.06 కోట్లు !

రైతు దినోత్సవానికి అత్యధిక వ్యయం

- ఒక్కో రైతువేదికకు రూ.లక్ష చొప్పన రూ.1.16 కోట్లు మంజూరు
- చెరువుల పండగ నిర్వహణకు సర్పంచ్‌లకు నిధులు
- యూసీలు ఇస్తున్న అధికారులు, సిబ్బంది



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఖర్చు రూ.5 కోట్లు దాటేలా ఉంది. ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం జిల్లాకు రూ.5.06 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను ఆయా కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత శాఖల ద్వారా పంపిణీ చేశారు. అయితే ఈ నిధులు ఏమాత్రం సరిపోలేదని, అదనంగా అయిన ఖర్చులకు సంబంధించి నిధులు ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ ఖర్చులకు సంబంధించిన యూసీ (యుటిలిటీ సర్టిఫికెట్లు) అందజేస్తున్నారు.

- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదో సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించింది. అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించింది.
- ఈనెల 2వ తేదీ నుంచి 22 వరకు 20 రోజుల పాటు ఉత్సవాలు జరిగాయి. రైతు దినోత్సవం, సురక్షా దినోత్సవం, విద్యుత్ విజయోత్సవం, పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, సాగునీటి దినోత్సవం, చెరువుల పండగ, సంక్షేమ సంబురాలు, సుపరిపాలన, సాహిత్య, తెలంగాణ రన్, మహిళా సంక్షేమం, వైద్యారోగ్యం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, గిరిజనోత్సవం, మంచీనీళ్ల పండగ, హరితోత్సవం, విద్యా దినోత్సవం, ఆధ్యాత్మిక దినోత్సవం, అమరులకు నివాళి ఇలా ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది.
- తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితిని, వచ్చాక జరిగిన ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లింది. అయితే ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5.06 కోట్లు మంజూరు చేయగా, ఈ నిధులను సంబంధిత శాఖలకు పంపిణీ చేశారు.

చెరువుల పండగకు..

- చెరువుల పండగ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులిచ్చింది. ఒక్కో చెరువుకు రూ.30 వేల చొప్పున జిల్లాలో 325 చెరువులపై ఈ చెరువుల పండగ నిర్వహించారు.
- తెలంగాణకు ముందున్న చెరువులను ఏవిధంగా బాగు చేసుకున్నామనే అంశంపై రైతులో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇచ్చిన నిధులకు మించి ఖర్చుయ్యాయని పేర్కొంటున్నారు.

నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లకు..

- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో కొన్ని కార్యక్రమాలు నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించారు. విద్యుత్ దినోత్సవం వంటి కార్యక్రమాలను నియోజకవర్గాల స్థాయిలో చేశారు.
- ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆయా నియోజకవర్గాల ప్రత్యేక అధికారులకు నిధులు ఇచ్చారు. ఖర్చులకు సంబంధించిన బిల్లులు అధికారులు ఇస్తున్నారు.
- మరోవైపు ఉత్సవాలు జరిగిన 20 రోజుల పాటు జిల్లా కలెక్టరేట్‌తో పాటు, జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణాల్లో ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో నిర్వహించారు.

రైతు వేదికకు రూ.లక్ష చొప్పన..

- రైతు దినోత్సవం నిర్వహణకు ఒక్కో క్లస్టర్‌కు రూ.లక్ష చొప్పున నిధులను పంపిణీ చేశారు. రైతువేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి రైతుదినోత్సం నిర్వహణకు ఈ నిధులు వెచ్చించాలని ఆదేశించింది.
- జిల్లాలో మొత్తం 116 రైతు వేదికలు ఉన్నాయి. ఈ మేరకు 1.16 కోట్లు ఇచ్చింది. కార్యక్రమం నిర్వహణ ఖర్చు రూ.లక్ష దాటిందని వ్యవసాయశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు.
- ఒక్కో చోట రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చులకు సంబంధించిన యూసీలు ఇస్తున్నారు.



కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాంతో ఓబీసీ అసోసియేషన్ సభ్యులు

కేంద్ర మంత్రికి ఓబీసీ అసోసియేషన్ వినతి

సంగారెడ్డి అర్బన్: కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాంను బేగంపేట క్యాంప్ కార్యాలయంలో ఓబీసీ అసోసియేషన్ ఎద్దు మైలారం కార్యవర్గం గురువారం కలిసింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి వర్క్ లోడ్ కల్పించాలని, కార్పొరేషన్ బారి నుంచి కాపాడాలని సభ్యులు కోరారు. ప్రభుత్వ అసంఘటిత రంగంలోని ఓబీసీ కుల గణన చేపట్టాలని, క్రిమీలేయర్ తొలగించాలన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో ఆర్డినెన్సు ఫ్యాక్టరీని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఓబీసీ జనరల్ సెక్రెటరీ అశోక్, ప్రభు, ఆకుల అశోక్ తదితరులు ఉన్నారు.

కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు కృషి

కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల

కొమురవెల్లి(సిద్దిపేట): నూతనంగా నిర్మిస్తున్న కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్లో కొమురవెల్లి వద్ద రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. గురువారం బీజేపీ జిల్లా నాయకులతో కలసి కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ సమీపంలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని ఆలయ అర్చకులు వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన మంత్రి నూతనంగా నిర్మిస్తున్న కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వే పనులను పరిశీలించారు. కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు గురించి రైల్వే శాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్ఎన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేష్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు ఉడుత మల్లేశ్ యాదవ్, కార్యవర్గ సభ్యులు మధుయాదవ్, సనాది కరుణాకర్, అమరేందర్ పాల్గొన్నారు.



కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రూపాల

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నారాయణఖేడ్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షాలు, అగ్నిప్రమాదాల్లో ఇళ్లకు నష్టం వాటిల్లిన ఏడుగురు బాధితులకు చెక్కులను అందజేశారు. సుల్తానాబాద్‌కు చెందిన భారతికి రూ.16 వేలు, నాగాపూర్‌కు చెందిన శోభాబాయికి రూ.10 వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి, కంగ్టి బీఆర్ఎస్ అధ్యక్షులు గంగారాం, రమేష్ చౌహాన్, సర్పంచ్‌లు సంగప్ప సంగమ్మ, రాజేష్‌చౌహాన్ పాల్గొన్నారు. అదేవిధంగా సంజీవన్‌రావుపేట్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. సర్పంచ్ ఎంబరి విఠల్, ఎంపీటీసీ భూపాల్, ఉపసర్పంచ్ సద్గుణవిఠల్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మ్యారేజ్ బ్యూరో కార్యాలయం ప్రారంభం



మ్యారేజ్ బ్యూరో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన పద్మశాలి మ్యారేజ్ బ్యూరో కార్యాలయాన్ని గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి శాంతినగర్‌లోని సంఘం భవనంలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మ్యారేజీ బ్యూరో కార్యాలయం తెరచి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలోని పద్మశాలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, సంస్థాగత కార్యదర్శి యాదగిరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి రవికుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జెట్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో ఇందిరా క్రాంతి

- స్వయం ఉపాధికి బాసటగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు
- ఎస్‌హెచ్‌జీల జీవన ప్రమాణాల మెరుగుకు దోహదం
- 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.920 కోట్ల లబ్ధి



ఐకేపీ రుణంతో పిండి, నూనెగిర్నీలు నడుపుతున్న సభ్యురాలు

కంది (సంగారెడ్డి): ఇందిరా క్రాంతి పథం పేదల బతుకుల్లో వెలుగు నింపుతోంది. బ్యాంక్ లింకేజి, స్త్రీనిధి ద్వారా స్వయం ఉపాధి కోసం రుణాలు తీసుకుంటున్నారు. కుటుంబ పోషణకు వారి వంతు సహకారం అందజేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకుంటున్నారు.

- జిల్లాలో 25 మండల సమాఖ్యలున్నాయి. 687 గ్రామ సమాఖ్యలు, 17,750 స్వయం సహాయక సంఘాలున్నాయి.
- వీటిలో 190,125 మంది సభ్యులున్నారు. 2022 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ ద్వారా 14,868 సంఘాలకు రూ.810 కోట్లు అందజేశారు. ++స్త్రీ నిధి ద్వారా రూ. 110 కోట్లు రుణాలుగా అందజేశారు. ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణాలు లభిస్తోంది. + దీంతో ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాల సభ్యులు)లు కిరాణా షాపు, వస్త్ర దుకాణాలు, కూరగాయల షాపు, పాల వ్యాపారం చేస్తున్నారు.
- మేకలు, గొర్రెలు, గేదెల పెంపకం, అరిశెల తయారీ, నర్సరీల పెంపకం, టైలరింగ్ వంటి పలు రకాల పనులు చేసుకొని జీవిస్తున్నారు.

డ్వాక్రా సంఘాల సహాయంతో ఉపాధి



గ్రామంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరా. నెలకు రూ.100 జమ చేస్తున్నాను. ప్రధాన మంత్రి ఫుడ్ ప్రాసెస్ మైక్రో ఎంటర్ ప్రైజెస్ ద్వారా రూ.లక్ష రుణం తీసుకొని పిండి, నూనె గిర్నిలు నడుపుకుంటున్నా. దీంతో ఆదాయం లభిస్తోంది. ప్రతినెలా రుణం వాయిదాలు చెల్లించడంతోపాటు కుటుంబ పోషణకు వాడుకుంటున్నాం.

– రమ, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



ఇందిరా క్రాంతి పథం(ఐకేపీ) సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తే తిరిగి అధికంగా రుణాలు పొందొచ్చు. తద్వారా వ్యాపారాలు చేపట్టి అధిక లాభం పొందొచ్చు. వడ్డీ కూడా ఎక్కువ పడే అవకాశం ఉండదు. తీసుకున్న రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి.

– సమత, ఏపీఎం ఐకేపీ

క్లుప్తంగా

చోరీకి వచ్చాడని..



చిన్నశంకరంపేట(మెదక్): దొంగతనానికి యత్నించిన ఓ వ్యక్తిని పట్టుకొని చెట్టుకు కట్టేశారు. వివరాల్లోకి వెళితే..గురువారం తెల్లవారుజామున మెదక్–చేగుంట రోడ్డుపై సూరారంచౌరస్తా వద్ద ఉన్న దుకాణాల వద్దకు వచ్చి షటర్‌ను తీసేందుకు ఓ వ్యక్తిని ప్రయత్నించాడు అయితే షటర్ తెరుచుకోకపోగా, ఆ శబ్దానికి ఇంటి యజమానులు మేల్కొన్నారు. వచ్చిన వాడు దొంగతనం కోసమేనని గ్రహించి పట్టుకుని కట్టేశారు. పేరు, చిరునామా అడగగా హవేళిఘనపూర్ అని ఒకసారి, మరోసారి గోపాల్‌పేట అని చెప్పడంతో అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అదుపులోకి తీసుకొని విచారించగా, ఏ వివరాలు కూడా చెప్పలేకపోయాడు. దీంతో మతి స్థిమితం లేని వ్యక్తిగా భావించి వదిలేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

దుబ్బాకరూరల్: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన రైతు మండల రాజు(40) ఈనెల 26న ఫిట్స్ రావడంతో ఇంటి ముందు ఉన్న సీసీ రోడ్డుపై పడ్డాడు. తలకు బలంగా తగలడంతో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం మృతుడి అన్న కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో..



ఆకుల శేఖర్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆకుల శేఖర్ (55) గ్రామంలోని ఓ బోరుబావి వద్ద గురువారం రాత్రి మరమ్మతులు చేస్తుండగా, కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాడిగేదె మృతి



రోదిస్తున్న బాధితులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందింది. మండల పరిధి రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతు బొగ్గుల లక్ష్మీనారాయణ వ్యవసాయంతో పాటు పాడి గేదెలతో జీవనం పొందుతున్నాడు. రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో బోరుబావి విద్యుత్ వైరు తగిలి విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. విలువ రూ.80వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో ఈ నెల 30న శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు, సలహాలను 9440149896 నెంబరుకు ఫోన్‌చేసి తెలయజేయాలని సూచించారు.

రింగ్‌రైల్‌తో మహర్దశ

కీలకంగా మారనున్న గజ్వేల్ రైల్వేస్టేషన్



ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం మ్యాపు

గజ్వేల్: ట్రిపుల్‌ఆర్ చుట్టూ రైల్వేలైన్ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ఉమ్మడి మెదక్‌జిల్లాకు భారీ ప్రయోజనం చేకూరినట్టే. అంతేకాకుండా గజ్వేల్ రైల్వేస్టేషన్ కీలకంగా మారి హైదరాబాద్ స్టేషన్లకు ప్రత్యామ్నాయం అవుతుంది. పెరిగిన అవసరాలకనుగుణంగా హైదరాబాద్ పరిధిలో కొత్తస్టేషన్ల విస్తరణకు అవకాశం లేదు. నగరానికి సమీపంలోనే ట్రిపుల్‌ఆర్‌కు ఆనుకొని ఉన్న గజ్వేల్ ఇక హబ్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ గతేడాది ఏర్పాటు చేసిన రేక్ పాయింట్ వల్ల లాజిస్టిక్ హబ్‌గా మారడానికి ట్రిపుల్‌ఆర్ చుట్టూ ఏర్పాటు చేసే రైల్వేలైన్ దోహదపడనుంది.

- ఉమ్మడి మెదక్‌జిల్లా పరిధిలోని ట్రిపుల్‌ఆర్ పనులకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయి కార్యాచరణ మొదలైంది.
- ట్రిపుర్‌ఆర్ 323 కిలోమీటర్ల పొడవు ఉండగా, ఉమ్మడి మెదక్ జిల్లాలోనే 110 కిలోమీటర్ల మేర ఉంది.
- 14 మండలాల పరిధిలోని 73కిపైగా గ్రామాల్లో భూసేకరణ చేపట్టడానికి చర్యలు మొదలయ్యాయి.
- జగదేవ్‌పూర్–గజ్వేల్–తూప్రాన్–నర్సాపూర్–సంగారెడ్డి మీదుగా కంది వరకు ఈ రోడ్డు విస్తరించనుంది.
- ట్రిపుల్‌ఆర్ పాక్షిక నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తొలివిడత రోడ్డు నిర్మాణం ఉమ్మడి మెదక్ జిల్లాలోనే చేపట్టాలని నేషనల్ హైవే ఆథారిటీ నిర్ణయించింది.
- తూప్రాన్ నుంచి సంగారెడ్డి వరకు 60 కిలోమీటర్ల మేర ముందుగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.
- ఇదే క్రమంలో ట్రిపుల్‌ఆర్ చుట్టూ రైల్వేలైన్ ప్రతిపాదన తెరపైకి రావడం ఒక్కసారిగా ఆసక్తి పెంచింది.
- మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36 కిలోమీటర్ల పొడవున ఈ న్యూబ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతోంది. ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో ఈ రైల్వేలైన్ కీలకమనే చెప్పాలి.
- కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి ఇప్పటివరకు రోడ్డు మార్గమే ఆధారం.
- ఈ లైన్‌వల్ల సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు, అక్కడి నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానుంది. ఫలితంగా ఈ లైన్ హైదరాబాద్ న్యూఢిల్లీ, కలకత్తా లాంటి మహానగరాలను కలుపుతూ జాతీయ లైన్‌గా మారనుంది.
- పెద్దపల్లి గ్రాండ్‌ట్రంక్‌లైన్‌కు ఇప్పటి వరకు సికింద్రాబాద్, కాజీపేట మార్గం అనుసంధానంగా ఉండేది.
- మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ పూర్తయితే ప్రయాణికులకు దూరభారం తగ్గనున్నది. సిద్దిపేట జిల్లాతో పాటు మెదక్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.
- మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు సుమారు 75కిలోమీటర్ల మేర పనులు పూర్తికావొస్తున్నాయి. ఆగస్టులో సిద్దిపేట వరకు ప్యాసింజర్ రైలు నడపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతేడాది జూన్‌లో గజ్వేల్‌లో రేక్ పాయింట్ కోసం గూడ్స్ రైలు సేవలు ప్రారంభమైన సంగతి తెలిసిందే.
- గజ్వేల్ నుంచి వెళ్తున్న ట్రిపుల్‌ఆర్ పక్కనే నిర్మించిన ఈ రైల్వేస్టేషన్ యథాతథంగా ట్రిపుల్‌ఆర్ రైల్వేలైన్‌కు దూరంగా అనుసంధానమయ్యే అవకాశాలున్నాయి.

నేటితరానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, అదే స్ఫూర్తితో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామచౌరస్తాలో సర్పంచ్ కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, రజక సంఘం ప్రతినిధులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల పోరాట చరిత్రను నేటి తరాలకు తెలియజేయ చెప్పాలన్న ఉద్దేశంతో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన తెలంగాణ ఉద్యమకారులను నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారి సేవలను స్మరించుకుంటూ, వారి గొప్పతనాన్ని నేటితరానికి తెలియజేస్తున్నామన్నారు. పటాన్‌చెరులోని సాకి చెరువుకట్టపై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

జిన్నారం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపారు. ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి కథనం ప్రకారం...గుమ్మడిదల గ్రామంలోని రాంనగర్‌కాలనీలో దామోదర్‌చారి అక్రమంగా మద్యాన్ని ఇంట్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడనే సమాచారం రాగా, గురువారం తనిఖీలు చేశామన్నారు. 19.5లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, దామోదర్‌చారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం జాతీయ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ భారత గణాంకసంస్థకు చెందిన డాక్టర్ జీఎస్‌ఆర్ పాల్గొన్నారు. కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కటింగ్ స్టాక్ సమస్యను విశదీకరించారు. ఇది అనేక నిర్ణయాలు తీసుకోవడానికి ఉపకరిస్తుందన్నారు. విద్యార్థులను అత్యంత ఆకర్షణీయమైన, కీలకమైన పాఠ్యాంశం వైపు ఆకర్షించడానికి ఉద్దేశించిన సరైన నిర్ణయాలు తీసుకోవడానికి గణితశాస్త్ర ప్రోగ్రామింగ్ గురించి డాక్టర్ మూర్తి వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ దత్తాత్రి నగేష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రెజా, సీనియర్ అధ్యాపకుడు ప్రొఫెసర్ బీఎం నాయుడు పాల్గొన్నారు. గీతం గణాంక ఆచార్యులు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ అనిల్, శివ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

మహలనోబిస్ గురించి..

భారతీయ శాస్త్రవేత్త, గణాంకవేత్త ప్రశాంత చంద్ర మహలనోబిస్ మొదటి ప్రణాళికా సంఘంలో పని చేశారు. ఒక పెద్ద నమూనా సర్వేను రూపొందించడంలో, దూరాన్ని గుర్తించడంలో ఆయన ప్రసిద్ధి చెందారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ స్థాపించి ఆంత్రో పోమెట్రీ రంగానికి తనవంతు సహకారం అందించారు. గణాంక రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా పలు పురస్కారాలు, బహుమతులను అందుకున్నారు.

రేపు ఓయూలో జాతీయ సదస్సు

లాలాపేట: ఓయూ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆర్గానో కెటాలసిస్ ప్రాస్పెక్ట్స్ అండ్ అపార్చునిటీస్ట్ అనే అంశంపై ఒక్క రోజు జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే సెమినార్ ప్రారంభోత్సవంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక వీసీ ప్రొ భట్టు సత్యనారాయణ, టీఎస్‌టీ–ఇండియా సెక్రటరీ డా.ఎస్.చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

మినీ వ్యాన్ బోల్తా

శివ్వంపేట(నర్సాపూర్): పాల ప్యాకెట్లు సరఫరా చేసే ఓ మినీవ్యాన్ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే... పలు గ్రామాల్లోని వ్యాపార దుకాణాల్లో పాల ప్యాకెట్లు వేసేందుకు తూప్రాన్ నుంచి బయలుదేరిన ఓ మినీవ్యాన్ మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామ శివారు తూప్రాన్- నర్సాపూర్ హైవే పై గురువారం సాయంత్రం అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నవీన్‌కు స్వల్పగాయాలు కాగా, స్థానికులు అతడిని తూప్రాన్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ రోడ్డుకు అడ్డంగా పడడంతో ఇరువైపులా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు, ప్రయాణికులు రోడ్డుపై అడ్డంగా పడిన వ్యాన్‌ను తొలగించి వాహన రాకపోకలు పునరుద్ధరించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

దళితబంధు ఇప్పిస్తామన్న కలెక్టరేట్ కాంట్రాక్టు ఉద్యోగులు

సిద్దిపేటఅర్బన్: కలెక్టరేట్‌లో పనిచేసే ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు గురువారం సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. సిద్దిపేటలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రాజనర్సింలు దళిత బంధు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కలెక్టరేట్‌లోని దళితబంధు విభాగంలో పనిచేసే ఉద్యోగులు శ్రీశైలం, శ్రీనివాస్, సాయికిరణ్ దళితబంధు పథకం ఇప్పిస్తామని చెప్పి బాధితుడి వద్ద రూ. 2 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. మొదటి విడతగా రూ. 50 వేలు తీసుకొని వారం రోజుల్లో ఇప్పిస్తామని నమ్మబలికారు. రోజులు గడుస్తున్నా తనను దళిత బంధు పథకంకు ఎంపిక చేయకపోవడంతో వారిని అడుగుతూ వచ్చాడు. ఈ నెల 26న కలెక్టరేట్ సమీపంలో రాజనర్సింలు వారిని ప్రశ్నించగా తమను బదనాం చేస్తున్నావని బాధితుడిని కులం పేరిట దూషించినట్టు తెలిపారు. రాజనర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

ఆ రూట్‌లో అరగంట ఆలస్యంగా మెట్రో



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లే మార్గంలో మెట్రో రాకపోకల్లో మార్పులు చేసినట్లు ఎల్‌అండ్‌టీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జులై 1 నుంచి 16వరకు ఉదయం 6 గంటలకు బయలుదేరాల్సిన మెట్రో అరగంట ఆలస్యంగా.. అంటే 6.30 గంటలకు బయలుదేరనుంది. మారిన వేళల ప్రకారం ఉదయం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయి.

ట్రాక్టర్ పైనుంచి పడి పారిశుధ్య కార్మికుడి మృతి



బాలయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ట్రాక్టర్ పైనుంచి పడి పారిశుధ్య కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లాపూర్ గ్రామానికి చెందిన చాకలి బాలయ్య (62) గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం చెత్తను పారబోయడానికి ట్రాక్టర్‌పై డ్రైవర్, మరో కార్మికుడితో కలిసి వెళ్లాడు. చెత్త ఖాళీ చేసి వస్తుండగా కుదుపులకు ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. ట్రాలీకి, ఇంజన్‌కు మధ్య పడడంతో తల, శరీరానికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించేలోపే మార్గమధ్యలో అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి అల్లుడు కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ముక్కు పోగులు.. కాళ్ల కడియాల కోసం

- మేడ్చల్ నుంచి సిద్దిపేటకు తీసుకెళ్లి మహిళ దారుణహత్య
- నిందితుడు వరుసకు తమ్ముడే



రాజమ్మ (ఫైల్)

సిద్దిపేట అర్బన్, మేడ్చల్‌రూరల్: కాళ్ల కడియాలు..ముక్కు పోగుల కోసం వరుసకు తమ్ముడయ్యే వ్యక్తి ఓ మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన రాజమ్మ(40) మద్యానికి బానిస అయ్యింది. ఈ క్రమంలోనే మద్యం తాగేందుకు ఈ నెల 15వ తేదీన ఓ బంగారం షాపులో తన వెండి ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.వెయ్యి అప్పుగా తీసుకుంది. మళ్లీ 21న అదే షాప్‌లో మరో రూ.1500 తీసుకొని మేడ్చల్‌కు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మేడ్చల్ బస్‌డిపో సమీపంలో పూడూర్‌కు వెళ్లే ఆటో కోసం వేచి ఉంది. ఈ సమయంలోనే కండ్లకోయకు చెందిన సంపత్ (ఆమెకు వరుసకు సోదరుడు) సంపత్ ఇంటి దగ్గర దింపుతానని మాయమాటలు చెప్పి రాజమ్మను తన ఆటోలో ఎక్కించుకున్నాడు. అనంతరం రాజమ్మను తుర్కపల్లి వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించాడు. అదే సమయంలో వారిని గుర్తించిన రాజమ్మ ఆడబిడ్డ మా వదినను ఇక్కడకు ఎందుకు తీసుకొచ్చావని ప్రశ్నించగా, ఇంటికి వెళుతున్నామని సంపత్ చెప్పాడు.అనంతరం రాజమ్మను సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈత వనంలోకి తీసుకెళ్లిన సంపత్ ఆమెపై దాడి చేసి కాళ్ల కడియాలు, బంగారు ముక్కు పోగులు ఇవ్వాలని బెదిరించాడు. అందుకు ఆమె నిరాకరించింది. దీంతో ఛాతీపై బలంగా కొట్టడంతో రాజమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె ఒంటిపై ఉన్న వెండి, బంగారు ఆభరణాలు తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. తాను చేసిన నేరాన్ని తప్పించుకునేందుకు ఆటోను సైతం విక్రయించాడు. అనంతరం చేర్యాలలో చోరీ సొత్తు తాకట్టు పెట్టి రూ.20 వేలు తీసుకున్నాడు. భార్య కనిపించడం లేదని రాజమ్మ భర్త రాజయ్య మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 27న మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా అనుమానంతో సంపత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా రాజమ్మను హత్య చేసినట్టు అంగీకరించాడు. సిద్దిపేట్‌త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈతవనంలో హత్యకు పాల్పడినట్టు చెప్పడంతో మేడ్చల్ పోలీసులు అక్కడి పోలీసులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రాజమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

వేర్వేరు చోట్ల ఎనిమిది మంది అదృశ్యం

పటాన్‌చెరు నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల ఎనిమిది మంది అదృశ్యమయ్యారు.

భర్త తిరిగొచ్చే సరికి..



రమణ , చందనప్రియ, గౌతమ్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఇస్నాపూర్ మారుతినగర్‌కు చెందిన మున్నూరు మహరాజ్ కూలిపని చేస్తున్నాడు. ఈనెల 21వ తేదీన ఇంటి నుంచి పనిపై బయటకు వెళ్లడంతో ఇంటి వద్ద భార్య రమణశ్రీ, పాప చందనప్రియ, బాబు గౌతమ్‌లు ఇంట్లోనే ఉన్నారు. తిరిగి మహరాజ్ సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి భార్య, ఇద్దరు పిల్లలు కనిపించలేదు. భార్యకు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. వారి ఆచూకీ లభించకపోవడంతో గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పనికి వెళుతున్నానని చెప్పి...



దిలీప్‌కుమార్ బేహారా (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం ..ఒడిశా రాష్ట్రం బాలేశ్వరం జిల్లా సిబల్ బేహారా గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్ బేహారా బొల్లారంలో నివాసం ఉంటూ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 24న పరిశ్రమకు వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో దిలీప్‌కుమార్ అల్లుడు బిష్వాభూషణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ తెలిపారు.

నగదు తీసుకెళ్లి...



ఆంజనేయులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఈ నెల 23 వ తేదీన కంప్యూటర్, జిరాక్స్ మిషన్ తీసుకొస్తానని చెప్పి రూ.1.5 లక్షలు తీసుకుని ఇంటినుంచి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించడం లేదు. దీంతో ఆంజనేయులు కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోదరుడు శివకుమార్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త బయటకు వెళ్లగానే...



ఇద్దరు పిల్లలతో బిలాసింగ్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సునీల్‌సుందర్ జీవనోపాధికి తెల్లాపూర్ పరిధిలోని ఇంద్రానగర్‌కు వలస వచ్చాడు. బుధవారం ఉదయం పనికి వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో భార్య బిలాసింగ్, కుమారుడు అసీం, కుమార్తె అలీనాలు కనిపించలేదు. దీంతో వారి ఆచూకీ కోసం చుట్టపక్కల వెతికాడు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


చిరకాల స్వప్నం నెరవేరింది

10 రోజుల్లో కేసీఆర్ చేతుల మీదుగా గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభం



గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి సారె వదులుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: దేవుడి ఆశీస్సులు, సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల నేతృత్వంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయ్యిందని, దీంతో హుస్నాబాద్ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. రేగొండలోని పంపుహౌస్‌లో 32 మెగావాట్ల సామర్థ్యం మోటర్‌ను ఆన్ చేసి గురువారం రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. ఇలా ట్రయల్ రన్ నిర్వహించడం ఇది రెండోసారి. అంతకముందు ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఆయన సతీమణి షమితలు గంగమ్మ తల్లికి పూజలు చేసి రిజర్వాయర్‌లో పసుపు, కుంకుమ, పూలతో సారెను వదిలారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి ఏకాదశి మంచిరోజు కావడంతో గోదావరి జలాల ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. కేసీఆర్ ప్రాజెక్టు ప్రారంభించే రోజు లక్ష మందితో బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రతిపక్షాలు అర్థరహితంగా మాటలు మాట్లాడుతున్నాయని, తెలంగాణ రాక ముందు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. 2009 నుంచి 2014 వరకు కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని అప్పుడు ఎంపీ, ఎమ్మెల్యేగా ఉన్న నాయకులు గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి తట్టెడు మట్టి కూడా తీయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ శంకర్, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీలు మాలోతు లక్ష్మి, లకావత్ మానస, కీర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఇరిగేషన్ ఈఈ రాములు, నేషనల్ లేబర్ కోపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలు